అక్రమ కట్టడాలను అరికట్టాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జంగారెడ్డి

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ, గుర్రంగూడ పరిధిలో గల అనేక కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వెంటనే వాటిని నిలిపివేయాలని బీజేపీ 26వ డివిజన్ నాయకుడు, గుర్రంగూడ మాజీ ఉపసర్పంచ్ జక్కిడి జంగారెడ్డి అధికారులను కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రజా ప్రతినిధుల అండతో నిర్మాణదారులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, వారికి మునిసిపల్ అధికారులు సైతం సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ దృష్ట్యా అక్కడి అక్రమ నిర్మాణాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు.



అల్మాస్‌గూడ చెరువును పరిశీలిస్తున్న మల్లారెడ్డి తదితరులు

చెరువుల సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టిన చెరువుల సుందరీకరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, దీనికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ సీనియర్ నేత నవారు మల్లారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఇక్కడి కోమటికుంట, పోచమ్మకుంట, ఎర్రకుంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని సుందరీకరణ పేరుతో వృథా చేశారని, అధికారులు సైతం దీనిపై దృష్టి సారించడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల సుందరీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, మల్గారి శ్రీధర్‌రెడ్డి, కె.వంశీ, చంద్రం, లక్ష్మయ్యగౌడ్, సత్తిరెడ్డి, కొండయ్య, విద్యాసాగర్, సుధీర్ పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో గల సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్టు నేతలు, పలు సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శివానాయక్, అంజయ్య, చత్రునాయక్, పాండునాయక్, శేఖర్‌యాదవ్, బాబు, యాదగిరిచారి పాల్గొన్నారు.

కార్మిక లోకం ఏకమై హక్కులను సాధించుకోవాలి

మన్సూరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, తమ హక్కులను సాధించుకునే వరకు కార్మిక లోకం ఏకమై పోరాడాలని సీఐటీయూ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. కార్మిక సమస్యలపై ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను వనస్థలిపురం శక్తినగర్‌లో మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో అలివేలు, ఎల్లమ్మ, జయమ్మ, యాదమ్మ, వెంకాయమ్మ, అనిత, నరసింహ, జగదీష్ పాల్గొన్నారు.

లారీ సప్లయర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాస్‌బాబును అభినందిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని అసోసియేషన్ భవనంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోకూరి శ్రీనివాస్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా లగడపాటి వెంకట్రావు, కోశాధికారిగా శాగా కృష్ణారెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ లారీ సప్లయర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడతానని తెలిపారు.

సౌమ్యశ్రీకి 'ఉప్పల' అభినందన



సౌమ్యశ్రీని సత్కరించి అభినందనలు తెలుపుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): సీబీఐలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైన మిర్యాలగూడకు చెందిన సన్నిధి కోటయ్య, సునీత దంపతుల కుమార్తె సౌమ్యశ్రీని టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అభినందించారు. నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె తల్లిదండ్రుల సమక్షంలో సౌమ్యశ్రీకి శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ తెలంగాణ నుంచి తొలిసారిగా సీబీఐ మహిళా అధికారిగా ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి సౌమ్యశ్రీ ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, మంజుల, నళిని, తులసీ, స్వాతి, ప్రవీణ్, రాజువర్ధన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి త్రినేత్రాంజనేయస్వామి జాతర

మన్సూరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ త్రినేత్రాంజనేయస్వామి వారి ఆలయ జాతర మహోత్సవాలు రేపటి(బుధవారం) నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ 14వ తేదీ బుధవారం నుంచి 16వ తేదీ శుక్రవారం వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని, గ్రామస్థులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు, రేపు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మన్సూరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ పేర్కొన్నారు. 13వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా 13న పలు ప్రత్యేక పూజలు, హోమాలు ఉంటాయని, 14న ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, సాయంత్రం 6.30గంటలకు భక్తరంజని బృందం వారిచే సర్వనామ సంకీర్తన ఇతర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని గణేష్‌యాదవ్ కోరారు.

రెసిడెన్షియల్ అనుమతులు..

కమర్షియల్ నిర్మాణాలు..!

- పెద్దఅంబర్‌పేట్‌లో అక్రమ నిర్మాణాలకు హద్దే లేదు
- అధికారుల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాల జోరు
- కోట్ల రూపాయల మున్సిపల్ ఆదాయానికి గండి
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు



రెసిడెన్షియల్ అనుమతితో నిర్మిస్తున్న కమర్షియల్ షెడ్డు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 12(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల జోరు సాగుతోంది. టౌన్ ప్లానింగ్ నిబంధనలు తుంగలో తొక్కుతూ..రెసిడెన్షియల్ అనుమతుల పేరుతో పెద్ద ఎత్తున కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. అంతే కాదు నిర్మాణానికి అనుమతి ఒక చోట తీసుకుని మరో చోట నిర్మాణం చేస్తున్నారు. మరికొందరు నిర్మాణదారులు అయితే మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకున్నా..హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొందినట్లు తప్పుడు పత్రాలతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. దీంతో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు హద్దే లేకుండా పోతుంది. ఈ వ్యవహారాలన్ని టౌన్‌ప్లానింగ్ విభాగం, మున్సిపల్ ఉన్నత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై అధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నా గత ఏడాది నుంచి కనీసం ఒక్క అక్రమ నిర్మాణంపై కూడా అధికారులు చర్యలు తీసుకోలేదంటే వాటిపై వారికి ఉన్న మక్కువ ఎలాంటిదో అర్థం చేసుకోవాల్సిందే.

చర్యల్లో నిర్లక్ష్యం..

కొంత కాలంగా మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం అయినట్లు విమర్శలు ఉన్నాయి. నేటి వరకు ఒక్క అక్రమ నిర్మాణంపై కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 27తో మున్సిపల్ పాలకవర్గం ముగిసిన సంగతి తెలిసిందే. మున్సిపాలిటీకి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న విషయం విదితమే..ప్రత్యేక అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. అక్రమ నిర్మాణాల కట్టడి విషయంలో జిల్లా అదనపు కలెక్టర్ దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే..

పర్యవేక్షణ ఎక్కడ..?

మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. మున్సిపాలిటీకి కోట్ల రూపాయల ఆదాయం గండిపడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులతో పాటు సిబ్బంది సైతం అక్రమ నిర్మాణాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు పెద్దఅంబర్‌పేట్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం పని చేస్తుందా.. అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పలు వార్డుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్డులతో పాటు కమర్షియల్ షెట్టర్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై ఫిర్యాదులు అందిన వెంటనే మున్సిపల్ ఉన్నత అధికారులతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు అమ్యామ్యాలు మాట్లాడుకుని చేతులు దులిపేసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పని పూర్తి అయిన తర్వాత వాటికి అనుమతులు ఉన్నాయంటూ అధికారులే తప్పుడు సమాచారాలు ఇస్తున్నారని పలువురు ఫిర్యాదు దారులు తెలిపారు. భవన నిర్మాణాల అనుమతుల విషయంలో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులకు ఫోన్లు చేసినా ఎత్తడం లేదని పలువురు దరఖాస్తుదారులు పేర్కొన్నారు.

పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం



చర్యలు తీసుకుంటాం..



అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలి. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేస్తాం. **- రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ పురపాలక సంఘం**

మిషన్ భగీరథ ట్యాంకులు ప్రారంభించండి: సబిత



గుర్రంగూడలో మిషన్‌భగీరథ ట్యాంకును పరిశీలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రజల దాహార్తిని తీర్చడానికిగాను మిషన్ భగీరథ పథకం చేపట్టిందని, సదరు పథకంలో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంకులను ప్రారంభించడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. వెంటనే వాటిని ప్రారంభించి ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా చేయాలని ఆమె అధికారులకు సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో మిషన్‌భగీరథ పథకంలో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన ట్యాంకులను ప్రారంభించడానికి అభ్యంతరం ఏమున్నదని ప్రశ్నించారు.

సంజీవని వనం సందర్శన..

గుర్రంగూడలో సాగర్ రహదారి పక్కన గల అటవీశాఖ నిర్వహణలోని సంజీవని వనం పార్కును ఎమ్మెల్యే సబితారెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సందర్శకులకు అందుతున్న సదుపాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, తుర్కయంజాల్ రైతు సహకార సంఘం డైరెక్టర్ సామ సత్తిరెడ్డి, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యురాలు సమైక్య జ్యోతీఅశోక్, జక్కిడి ముత్యంరెడ్డి, మాదరి రమేశ్, పుట్టగల్ల రవీందర్, సంజీవ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి

- బ్యాంకర్లకు బీఎంసీ కమిషనర్ సరస్వతి సూచన



బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న కమిషనర్ సరస్వతి, అధికారులు

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేస్తున్న యువతీ యువకుల దరఖాస్తుల పరిశీలనలో తగిన జాగ్రత్తలు పాటించాలని, లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరపాలని బడంగ్‌పేట్ కమిషనర్ పి.సరస్వతి బ్యాంకర్లకు సూచించారు. సోమవారం రాజీవ్ యువ వికాసంపై కార్పొరేషన్ కార్యాలయంలో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడు తూ ఇప్పటికే మునిసిపల్ స్థాయి అధికారులు, సిబ్బంది కలిసి లబ్ధిదారుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారని, వాటిని కంప్యూటర్లలో అప్‌లోడ్ కూడా చేశారని అన్నారు. అర్హులైన వారికి రుణాలు అందజేయాల్సిన బ్యాంకర్లు సదరు దరఖాస్తులను స్క్రూటినీ చేసి తుది జాబితాను రూపొందించాలని ఆమె సూచించారు. బడంగ్‌పేట్‌లో రాజీవ్ యువ వికాసం పథకానికి మొత్తం 2,385 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 1208 మంది బీసీలు, 560 మంది ఎస్సీలు, 250 మంది ఎస్టీలు, 154 మంది ఈబీసీలు, 191 మంది ముస్లింలు, 22 మంది క్రిస్టియన్‌లు ఉన్నారని కమిషనర్ వివరించారు. ఆయా వర్గాల దరఖాస్తులను స్క్రూటినీ చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె బ్యాంకర్లకు వివరించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ ఏఎంసీ శ్యాంసుందర్, పలు విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం



మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమ పాఠశాల భవనం

ఓల్డ్‌మలక్‌పేట, మే 12(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలో నల్లగొండ చౌరస్తాలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ కె.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఆమె మాట్లాడుతూ 1నుంచి పదవ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని జూన్ చివరి వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 6నుంచి 14 సంవత్సరాల లోపు చెవిటి, మూగ పిల్లలు ఆయా తరగతుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పని దినాల్లో పాఠశాల కార్యాలయం లో అడ్మిషన్లు పొందవచ్చని రాష్ట్రంలోని ఏ జిల్లావారైనా సరే ఇక్కడ అడ్మిషన్లు తీసుకొని విద్యాభ్యాసం చేసుకోవచ్చని తెలిపారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, చక్కటి హాస్టల్ భోజనవసతి అన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్రతి విద్యార్థికి నెలకు రూ.250 కాస్మోటిక్ చార్జీలు చెల్లిస్తారు. అడ్మిషన్లు పొందగోరేవారు సదరం సర్టిఫికెట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, మూడు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అడ్మిషన్ల వివరాలకోసం 7674933347, 9000221301 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అమర సైనికులకు ఘన నివాళి



బడంగ్‌పేట్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో భారత సైనికులు చేస్తున్న పోరాటంలో విజయం కచ్చితంగా భారత్‌దేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. యుద్ధంలో అమరులైన సైనికుల త్యాగం వృథా కారాదని ఆమె అన్నారు. అమర సైనికులకు నివాళులర్పిస్తూ ఆదివారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ ఎవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని పారిజాతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర జవాన్ మురళీనాయక్ ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని గంటల్లోనే ఉల్లంఘించిన పాకిస్థాన్‌కు భారత్ తన సత్తా చూపాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. భారత సైనికులు పాక్‌పై చేస్తున్న యుద్ధం కేవలం ఉగ్రవాదం నిర్మూలనపై చేస్తున్న పోరాటం మాత్రమేనని ఆమె వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, గ్రీన్‌రిచ్ కాలనీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



యుద్ధంలో వీర మరణం పొందిన అమర జవాన్ మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

హయత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో..

హయత్‌నగర్ : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో దేశం కోసం వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన తెలుగు ముద్దుబిడ్డ అయిన వీర జవాన్ ఎం. మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సోమవారం రాత్రి 7గంటలకు హయత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అమర జవాన్ మురళీనాయక్ అమర్‌హై అంటూ నినాదాలు చేస్తూ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులను, జాతీయ జెండాలను చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమర జవాన్‌కు నివాళులు అర్పించా రు. కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సీఐ నాగరాజుగౌడ్, బీజేపీ నాయకుడు రవీందర్‌రెడ్డి, బండారు భాస్కర్, పారంద రమేష్, మురళీధర్‌రెడ్డి, మధు ముదిరాజ్, నరసింహారెడ్డి, సుజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యువ కవి మల్లె మస్తాన్ కశ్యప్‌ను సన్మానిస్తున్న శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు

యువ కవికి ఘన సన్మానం

హయత్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌కు చెందిన యువకవి, సహాయ దర్శకుడు మల్లె మస్తాన్ కశ్యప్‌ను ఆదివారం ఏలూరులో నిర్వహించిన ప్రపంచ తెలుగు సభల్లో భాగంగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, కొల్లి రమావతి, పార్థసారధి, కలిమిశ్రీ, శిఖ ఆకాశ వాసుదేవ, కావూరి శ్రీనివాస్, కవులు, కళాకారులు తదితరులు హాజరైనారు.



జానపదం మాప్రాణపదం గద్దర్ అన్న ఐకాన్ అవార్డు-2025ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా అందుకుంటున్న డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాపతి

జానపదం.. మా ప్రాణపదం అవార్డు అందజేత

ఎల్బీనగర్, మే 12(ఆంధ్రజ్యోతి): సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులకు జానపదం మాప్రాణపదం గద్దర్ అన్న ఐకాన్ అవార్డు-2025లను అందజేశారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎల్బీనగర్‌కు చెందిన సమాజ సేవకుడు డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాపతికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, గద్దర్ పాల్గొన్నారు.



త్రివిధ దళాల అధికారుల చిత్రపటాలతో ఆలయ కమిటీ సభ్యులు

భారత సైన్యానికి మద్దతుగా పూజలు

సైదాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో ఎంతో వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి భగవంతుడు మరింత శక్తిని ఇచ్చి విజయపథంలో నడిపించాలని కోరుతూ సోమవారం సైదాబాద్ కాలనీ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యనారాయణ, వనం జగదీశ్వర్‌రావు, ప్రసాద్‌రావు, రాజ్యలక్ష్మి, రఘునాథ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



నాగరాజు(ఫైల్)

సైదాబాద్ : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సైదాబాద్ నీలం రాజశేఖర్‌రెడ్డినగర్(చింతల్ బస్తీ)లో నివాసముంటున్న అన్యపాక నాగరాజు(32) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఇతడికి భార్య, ఇద్దరు సంతానం. పది రోజుల క్రితం గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం చెర్వుగట్టు యాత్రకు వెళ్తానని తల్లిని డబ్బులు అడిగాడు. దీంతో మద్యంమత్తులో గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మియాపూర్ : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌రావునగర్ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రామ్‌లాల్(25) భార్య జాను, కుమారుడు ఆదిత్యతో కలిసి గోపాల్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. రామ్‌లాల్ కూలి పనికి, జాను ఇళ్లలో పనులకు వెళ్తుంటారు. భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండగా రామ్‌లాల్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం భార్యతో గొడవపడిన రామ్‌లాల్ తన తండ్రి లక్ష్మణ్‌నాయక్ వద్ద ఉంటున్నాడు. ఈనెల 10న బయటకి వెళ్లి వస్తానని చెప్పి తండ్రి ఫోన్ తీసుకుని వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో లక్ష్మణ్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గోపాల్‌రావునగర్ అపార్ట్‌మెంట్స్ మధ్యలో దుర్వాసన వస్తుందని స్థానికులు సమాచారం అందించగా అక్కడకు చేరుకున్న పోలీసులు రామ్‌లాల్ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.